క్లుప్తంగా

సూపర్‌మార్కెట్ ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువు బజారులో నూతనంగా ఏర్పాటు చేసిన శాకంబరి సూపర్ మార్కెట్‌ను మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను గురువారం ప్రారంభించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ సూపర్‌మార్కెట్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్వాహకులు తిరుమలశెట్టి శ్రీనివాస్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వర రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, షేక్ సత్తార్, న్యాయవాది గుంటక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

114 మందికి వైద్యపరీక్షలు

నవాబుపేట(పెనుగంచిప్రోలు): సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కె.వాణి సూచించారు. నవాబుపేటలోని రామాలయం వద్ద కొణకంచి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 114 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయని, ప్రజలు మంచి పోషకాహారం తీసుకోవటంతోపాటు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.

డ్రగ్స్ వినియోగంతో జ్ఞాపకశక్తి తగ్గుదల



కంచికచర్ల : యువత మత్తుపదార్థాల వినియోగంతో నిండు జీవితాన్ని బలిచేసుకోవద్దని కంచికచర్ల ఎస్ఐ బోనగిరి రాజు సూచించారు. మండలంలోని కీసర లాసాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం మాదక ద్రవ్యాలను అరికడదాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ రాజు మాట్లాడుతూ యువత దేశానికి పనికొచ్చేలా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగంతో జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్నారు. యువత మత్తుపదార్థాలు, సభ్యకరమైన సినిమాలు, ఇంటర్నెట్ వంటి వాటికి ఆకర్షితులయి అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ నియంత్రణకు పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం

జుజ్జూరు(వీరులపాడు): గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో అరుంధతీదేవి ఆదేశించారు. మండలంలోని జుజ్జూరు మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై గ్రామ కార్యదర్శులతో గురువారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సూచించారు.

రైతులకు శిక్షణ



నందిగామ టౌన్: వరిసాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని నందిగామ ఏడీఏ ఐకె శ్రీనివాస్ సూచించారు. ది పున్నవల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం సమన్వయంతో మండలంలోని గోళ్లమూడిలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర పంట, కలుపు యాజమాన్యపద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓఖాశీం, వ్యవసాయ సహాయకులు, ఉత్పత్తిదారుల సంఘం సీఈవో తేజ, రైతులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని జగ్గయ్యపేట ఏడీఏ సి.భవాని పేర్కొన్నారు. అనిగండ్లపాడులో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ విత్తనశుద్ధి, నీటియాజమాన్యం, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ రామసుబ్బారెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రూ.15వేలు ఆర్థికసాయం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు పెనుగంచిప్రోలు మండలం వెంకటాపురంనకు చెందిన మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కమతం బ్రహ్మానందరావు రూ.15వేలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ చేతుల మీదుగా గురువారం ఆర్థికసాయంగా అందజేశారు. తన కుమారునికి ఎస్‌బీఐలో ఉద్యోగం వచ్చిన సందర్భంగా ఆర్థికసాయం అందించినట్లు బ్రహ్మానందరావు తెలిపారు. మైనేని రాధ, పెనుగంచిప్రోలు మండల టీడీపీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, మాదినేని వెంకట్రావు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందిపై దాడులు సమాజానికి చేటు..



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడటం దారుణం. వైద్యసిబ్బందిపై దాడులు సమాజానికి చేటు చేస్తాయి. పౌరులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వాలు సైతం అటువంటి ఘటనలకు పాల్పడిన వ్యక్తులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. పటిష్టమైన రక్షణ చేపట్టాలి.

– ఉప్పలూరి మాలతి, ఎంఎల్‌హెచ్‌పీ, కీసర ఆరోగ్య ఉపకేంద్రం

ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలి..



వైద్యరంగంలో అధికశాతం మహిళలే పనిచేస్తున్నారు. పని ప్రదేశంలో మహిళా ఉద్యోగులకు తోటి ఉద్యోగులు, వైద్యసేవల కోసం వచ్చే వ్యక్తుల నుంచి లైంగిక వేధింపులు, దాడులు తప్పడం లేదు. వైద్యసిబ్బంది ఎదుర్కొనే ఇబ్బందులు, దాడులను అరికట్టేందుకు ప్రతి వైద్యశాలలో ప్రభుత్వం ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేయాలి. ఆయా ఫిర్యాదులను సత్వరమే విచారించి, ఆకృత్యాలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకోవాలి.

– జ్యోతి స్టాఫ్‌నర్స్, కంచికచర్ల పీహెచ్‌సీ

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



చిల్లకల్లులో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, టీచర్లు



బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీసుజాత, ఉపాధ్యాయులు



వ్యాసరచన, వక్తృత్వ, శతకపద్యాల పోటీల విజేతలతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, రసమయి సాహితీ సమితి ప్రతినిధులు

జగ్గయ్యపేట: తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం జగ్గయ్యపేట నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగానిర్వహించారు. ఎగ్జిబిషన్‌లతోపాటు పలు వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా తమ వేషధారణలతో అందరినీ అలరించారు. మండలంలోని చిల్లకల్లు జెడ్పీ పాఠశాలలో వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి చిత్రపటానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ధర్మవరప్పాడుతండా, గండ్రాయి, బలుసుపాడు, షేర్‌మహ్మద్‌పేట పాఠశాలలు, కోదాడరోడ్డులోని తపోవన్ విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఎం.సుధీర్ ఆధ్వర్యంలో భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులంతా సాంప్రదాయ దుస్తులు ధరించడమే కాకుండా తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ధర్మవరప్పాడుతండాలో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : మండలంలోని మక్కపేట, చిన్నమోదుగపల్లి, వత్సవాయి, దబ్బాకుపల్లి, కంభంపాడు, భీమవరంతోపాటు ఆయా పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సంప్రదాయ దుస్తుల వేషధారణలో విద్యార్థులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గిడుగు రామ్మూర్తి జయంతిని నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు, జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ తదితరులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుభాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ ఎంవీ ఫణికుమార్, పాఠకులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి..

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు తెలుగుభాషపై మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పిలుపునిచ్చారు. మాతృభాషా దినోత్సవాన్ని జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఎమ్మెల్యే తాతయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగుభాషను ఆధునిక భాషగా తీర్చిదిద్దటానికి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. మనభాష, సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలుగా కొనసాగుతున్నాయంటే అందుకు కారణం తెలుగుభాష మాత్రమేనన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, శతక పద్యాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే తాతయ్య బహుమతులను అందజేసి అభినందించారు. తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో రసమయి సాహితీ సమితి ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్ పి.సైదేశ్వరరావు, కె.అగ్రహారం ఎంపీయూపీ స్కూల్, విజ్ఞాన్, నారాయణ, విజేత, శ్రీమేథ పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ అధికారి ఎ.ప్రభ, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా బలుసుపాడు రోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొండపల్లి లక్ష్మీసుజాత, ఉపాధ్యాయులు కలసి గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని కూడా నిర్వహించారు.



గిరిజన మహిళ వేషధారణలో చిన్నారి

నందిగామ మండలంలో..



తెలుగుతల్లి, గిడుగు రామ్మూర్తి వేషధారణలో చందాపురం విద్యార్థులు

నందిగామ టౌన్: తెలుగు బాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి అందించిన సేవలు మరువలేనివని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని చందాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగాఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు బాష గొప్పతం, బాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. . తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి వేషధారణలో విద్యార్థులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు.

పెనుగంచిప్రోలు మండలంలో..



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ సాయిహర్ష తదితరులు



కేవీఆర్ హైస్కూల్‌లో క్రీడల విజేతలతో ఉపాధ్యాయులు

పెనుగంచిప్రోలు: 'అమ్మ' అనే పిలుపులోనే కమ్మదనం ఉంటుందని పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ సాయిహర్ష, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఏబీపీ అధికారి మోహన్‌సందీప్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులు తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన వారి చిత్రపటాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం సునీల్, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



కంభంపాడు జెడ్పీ పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థులు, పక్కన టీచర్లు



కంచికచర్లలో నివాళులర్పిస్తున్న రామచంద్రుడు, ఇస్మాయేల్ తదితరులు

జగ్గయ్యపేట కమిషనర్‌గా రామ్మోహనరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్‌గా ఎం.రామ్మోహన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు స్పెషల్ సీఎస్ అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జగ్గయ్యపేట ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఈనెలాఖరుకు పదవీ విరమణ చేయనుండగా, ఆయన పదవీ విరమణ అనంతరం ఆపోస్టులో చేరాలని రామ్మోహన్‌రావుకు సూచిస్తూ ఉత్వర్వులు జారీచేశారు.

పంట నమోదు చేయించుకోవాలి

వత్సవాయి : పంటలు సాగుచేస్తున్న రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులంతా తప్పకుండా తాము సాగుచేస్తున్న పంటల వివరాలను సెప్టెంబర్ 5వతేదీలోగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

2న చేపల పెంపకం హక్కుల వేలం

మంగొల్లు(వత్సవాయి) : మండలంలోని మంగొల్లు ఎర్ర చెరువు, బంధం చెరువులలో చేపలు పెంచుకునే హక్కులకు సెప్టెంబర్ రెండోతేదీన వేలం నిర్వహించనున్నట్లు సర్పంచి అన్నెపాక ప్రణీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసచివాలయం వద్ద ఉదయం పది గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు. పాటలో పాల్గొనేవారు విధిగా లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఏడాది కాలపరిమితికి సంబంధించిన చేపల పెంపకం హక్కులను కైవసం చేసుకున్నవారు వెంటనే మొత్తం నగదును చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం



రావిరాల(జగ్గయ్యపేట): కర్మాగారాల యాజమాన్యాలు గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. రావిరాల గ్రామంలో రామ్‌కో సిమెంట్స్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్, అంగనవాడీ కేంద్రం ప్రహరీ గోడను గురువారం రామ్‌కో ప్రెసిడెంట్ ఆశీష్ కుమార్ శ్రీవత్సవతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని కర్మాగార యాజమాన్యాలు ఆయా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో రామ్‌కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌కె మూర్తి, జీఎం ఫరూక్ అహ్మద్, హెచ్ఆర్ రామసాయి, గ్రామసర్పంచ్ నరసింహారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీవ్రతం

పెనుగంచిప్రోలు: శ్రావణ మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో లీలాకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు వ్రతం ప్రారంభమవుతుందన్నారు. వ్రతంలో పాల్గొనే మహిళా భక్తులకు పూజ సామాగ్రిని ఉచితంగా అందజేస్తామని వివరించారు.

ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాస ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని శ్రీకనకదుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కోళ్ల పెంపకంపై శిక్షణ



గరికపాడు(జగ్గయ్యపేట): మహిళలు పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలని గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ కృష్ణంరాజు సూచించారు. స్థానిక కేవీకేలో గురువారం జాతీయ వ్యవసాయ పరిశోధనా యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పెంపకంపై వృత్తి విద్యాశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంస విక్రయాలు పెరిగినందున పెరటి కోళ్ల పెంపకం చక్కటి ఆదాయమార్గంగా మారిందని పేర్కొన్నారు. కోళ్ల పెంపకం ద్వారా మహిళలు ఆదాయం పొందవచ్చని సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు జశ్వంత్‌రెడ్డి, సుప్రియ, మహిళలు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

నందిగామలో 175గ్రాముల బంగారం చోరీ

నందిగామ టౌన్: పట్టణంలోని చెరువు బజారులో అగంతకులు చోరీకి పాల్పడి బంగారం, నగదు దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు చెరువుబజారుకు చెందిన గోపు సుధాకర్ కుటుంబ సభ్యులు బుధవారం కంచికచర్ల మండలం నక్కలంపేటలో బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి హాజరయ్యేందుకు వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి గేటు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులోని 175 గ్రాముల బంగారం, రూ.25వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ వైవీఎల్ నాయుడు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మొత్తం రూ.15లక్షల విలువగల బంగారం చోరీకి గురైందని బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

జ్వరం తగ్గినా.. పీడిస్తున్న నొప్పులు

- కీళ్ల నొప్పులు.. కాళ్ల వాపులతో అల్లాడుతున్న జనం
- రోజుల తరబడి తగ్గని నీరసం
- పీహెచ్‌సీల వద్ద బారులుతీరుతున్న రోగులు



పెనుగంచిప్రోలు పీహెచ్‌సీలో బారులు తీరిన రోగులు



పెనుగంచిప్రోలులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణెమ్మ, పుష్పావతి

పెనుగంచిప్రోలు: జ్వరం ఒకటి, రెండురోజుల్లో తగ్గుతున్నా ఒంటి నొప్పులు మాత్రం రోగులను పట్టి పీడిస్తున్నాయి. నొప్పులు భరించలేకపోతున్నామని ఆయా గ్రామాల జ్వరపీడితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నొప్పులు భరించలేక మందులు వాడితే క్రియాటినిన్ లెవల్స్ పెరుగుతున్నాయని వాపోతున్నారు. పెనుగంచిప్రోలు మండలంలో ఏగ్రామంలో చూసిన జ్వరపీడితుల పరిస్థితి ఇదే.

కీళ్ల, ఒంటినొప్పులు భరించలేక ఎక్కువ మంది స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. కొందరు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతుండగా, వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితుల్లో ఫీవర్ సర్వేతోపాటు వలంటీర్ల సేవలు వినియోగించుకునేవారు. ఇప్పుడు అలా లేకుండా పోయిందని ప్రజలు చెబుతున్నారు. మండలంలోని ముచ్చింతాల గ్రామానికి చెందిన మణెమ్మ, పుష్పావతి, యేసు తదితరులకు జ్వరం తగ్గినా వారం రోజులుగా నొప్పులు తగ్గకపోవడంతో పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. వారికి వైద్యులు సెలైన్ బాటిల్స్ ఎక్కించడంతోపాటు మందులు అందజేశారు. నొప్పులు భరించలేక పోతున్నామని, వాపులు కూడా వస్తున్నాయని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. జ్వరపీడితులు ఆయా పీహెచ్‌సీలు, ఆర్ఎంపీ వైద్యుల వద్ద బారులుతీరుతుండటమే సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది. వైద్యులు మాత్రం నొప్పులకు మంచి ఆహారం తీసుకుంటూ శక్తిని పెంచుకోవాలని సూచిస్తుండగా, రోజుల తరబడి నొప్పులను భరించలేకపోతున్నామని జ్వరపీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆయా పాఠశాలలు, కళాశాలల్లో గురువారం జాతీయ క్రీడోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్)కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడోత్సవం, తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అంకయ్య మాట్లాడుతూ క్రీడాదినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం విశిష్టతను వివరించారు. కళాశాల కామర్స్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ పి.రవి, తెలుగు విభాగం అధ్యాపకులు ఎ.నాగేశ్వరరావు,ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నాగార్జున హైస్కూల్‌లో నిర్వహించిన ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్కూల్ డైరెక్టర్ జి.రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ జీవీ.రాజేష్ బహుమతులను అందజేసి అభినందించారు. పీఈటీలు శ్రీనివాసరావు, సుధాకర్ పాల్గొన్నారు.